


## నెలనెలా నవ్వుల పండగ

## మల్లాది వెంకటకృష్ణమూర్తి స్పెషల్

### మీకేం తెలుసు!?

"**ఏమిటి?** ఇంత అందమైన అమ్మాయితో నీకు విడకులు కావాలా?" జడ్జి ఆశ్చర్యంగా ప్రశ్నించాడు విడాకులు కోరిన భర్తని.

"అవును సార్.."



"తెల్లటి దేహచ్ఛాయ, ఆకర్షణీయమైన మొహం, చక్కటి చిరునవ్వు, బ్యూటిఫుల్ స్ట్రక్చర్..మరో సారి ఆలోచించుకో.." సలహా ఇచ్చాడు జడ్జి.

వెంటనే భర్త తను తొడుక్కున్న బూట్లని విప్పి జడ్జికి చూపించి చెప్పాడు..

"వీటిని జాగ్రత్తగా చూడండి సార్. ఇవి చేసిన చర్మం మెత్తగా మృదువుగా ఉంది. నా పాదాలకి సరిపడే సైజు , పాలిష్ చక్కగా పట్టి ఎప్పుడూ నిగనిగలాడుతుంటాయి. కానీ ఇవి ఎక్కడ కరుస్తాయో ఒక్క నాకు మాత్రమే తెలుసు.."

మారు మాట్లాడకుండా జడ్జి వెంటనే విడాకులు మంజూరు చేసేశాడు.

***

***

చౌచౌ...

# ఏరుకొచ్చిన నవ్వులు

మంత్రిగారు అనర్గళంగా ఉపన్యసిస్తున్నారు. కొంత ఉపన్యాసం జరిగిన తర్వాత శ్రోతలు ఒక్కరొక్కరే లేచి వెళ్ళిపోవటం ప్రారంభించారు. "ఏమిటి వాళ్ళంతా అలా మధ్యలోనే లేచి వెళుతున్నారు?" అని అడిగారు మంత్రిగారు.

"మా ఊరివాళ్ళకు నిద్రలో నడిచే అలవాటు ఎక్కువ సర్" అన్నాడు స్థానిక యం.ఎల్.ఏ.

ఆ గ్రామం ప్రతిపక్షులైన ఒక ఎమ్మెల్యేకీ, ఒక మాజీమంత్రికి కూడా స్వగ్రామం. ఒక సాయంత్రం మాజీ మంత్రిగారు పెంపుడు కుక్కను వెంటబెట్టుకుని పొలంగట్టుమీదుగా షికారుకు బయలుదేరారు.

ఎమ్మెల్యేగారు ఎదురై "సాయం సంధ్యవేళ ఈ గాడిదను వెంటబెట్టుకుని ఎక్కడికి బయలుదేరారు?" అని పరామర్శించారు.

"ఇది గాడిదకాదు. కుక్క" అన్నారు మంత్రిగారు ప్రతిపక్ష ఎమ్మెల్యే పలకరించినందుకు సంతోషిస్తూ.

"నేనడిగింది మిమ్మల్నిగాదు. కుక్కను" అన్నాడు ఎమ్మెల్యే.

ఒక స్త్రీ రెడీమేడ్ షాపుకు వెళ్ళి తన భర్తకు ఒక షర్టు కొనాలనుకుంది. కానీ ఆమెకు సైజు సరిగా తెలియదు. "మావారికి ఒక షర్టు కావాలి. కొలతలు తెలుసుగానీ అసలు సైజు ఎంతో మాత్రం గుర్తులేదు" అందామె షాపువానితో.

షాపతను వెంటనే "ఆయన సైజు పదమూడు గదా మేడం" అన్నాడు అనుమానంగా.

"అరే నిజమేనే. మీకెలా తెలుసు?"

"భార్యలచేత షర్టులు కొనిపించే భర్తలు చాలామంది సైజు అంతే వుంటుంది లెండి" అన్నాడు ఆ షాపతను.

ఒక భర్త భార్యతో "నేను చూడటానికి అందంగా ఉండను. నీ అంత చదివినవాడినీ కాదు. మంచి ఉద్యోగమూ లేదు. మరి నీవెందుకంత పట్టుబట్టి నన్నే చేసుకున్నావ్? ఇందుకు నీలో కలిగిన ప్రేరణ ఏమిటి?" అనడిగాడు కుతూహలం ఆపుకోలేక.

"మా నాన్న" క్లుప్తంగా జవాబిచ్చిందామె.

"మీ నాన్నా? ఎలాగా?"

"మీ ఫిక్సడ్ డిపాజిట్స్ ఉన్న బ్యాంక్ మేనేజర్ మా నాన్నే."

ఒక అతి సన్నని సుబ్బారావు ఆర్టీసీ బస్‌లో ఎక్కి సీటు కోసం వెతికాడు. ఒక త్రీ సీటర్‌లో అతి లావు లక్ష్మయ్య కూర్చుని ఉన్నాడు. ఒక్కడే అయినా సీటు మొత్తం పరిచినట్టున్నాడు. చేసేది లేక సుబ్బారావు ఆ సీట్లోనే కూర్చున్నాడు. బస్ కదలటంతోనే లక్ష్మయ్య శరీరం అటూ ఇటూ దొర్లుతూ సుబ్బారావు కూర్చోటమే కష్టమైంది.

సుబ్బారావు విసుక్కుంటూ, "ఈ ఆర్టీసీ వాళ్ళు పాసింజర్స్‌ను లగేజీలాగే తూకం వేసి చార్జీ చేస్తే బాగుండును" అని గొణుక్కున్నాడు.

ఇది విన్న లావు లక్ష్మయ్య నవ్వేశాడు. "అలా చేసేటట్లయితే నిన్నెవడూ బస్‌లో ఎక్కనివ్వడు. ఎక్కనిస్తే ఆర్టీసీ దివాలా తీయాల్సిందే" అన్నాడు.

ఇద్దరు మిత్రులు నాటకం చూసి బయటికొచ్చారు. ఈ నాటకంలో నీకే పాత్ర నచ్చింది?" అని అడిగారు ఒకరు రెండవ వారిని.

"హీరో తండ్రిపాత్ర"

"ఛా! అతనేం బాగా యాక్ట్ చెయ్యలేదు. నీకా పాత్ర ఎలా నచ్చిందో ఆశ్చర్యంగా ఉందే?"

"నాకు నాటకం చూడటానికి ఫ్రీ పాస్ ఇచ్చిందతనే."

COMMENTS